## 37. ఖైదీలం

ఓ రాజు ఓ సారి చెరసాలని సందర్శించాడు. అక్కడున్న ఖైదీల యోగక్షేమాలు ఆప్యాయంగా విచారించి వాళ్ళు కోరింది ఏదైనా ఇస్తానని చెప్పాడు.

ఒకరు దోమతెరని, ఇంకొకరు కంబళిని, మరొకరు తన కిష్టమైన మసాలా గారెని... ఇలా తలొకటి కోరుకున్నారు. అంతేకాని, ఎవరూ తనకి స్వతంత్ర్యం కావాలని కోరుకోలేదు.

మనమంతా కూడా ఆ ఖైదీల్లాంటి వాళ్ళమే. దేవుడిని సంపద, ప్రమోషన్, పిల్లలకి ఉద్యోగం, ఆరోగ్యం లాంటివి కోరుకుంటాం తప్ప, పరమ శాంతిని ఇచ్చే ఆనందకరమైన ముక్తిని కోరుకోం.

## 38. మనసుకి తీపి

తన శిష్యుడి కూతురి పెళ్ళికి హాజరయ్యాడు ఓ మహాత్ముడు. ఆయన్ని ఒకతను ప్రశ్నించాడు.

"స్వామీ. మీలాంటివారు మనసుని భగవంతుని మీద పెట్టమని చెప్తూంటారు. కాని, అది ప్రాపంచిక విషయాల మీదకే అధికంగా వెళ్తూంటుంది. దాన్ని పరిపూర్ణంగా దైవం మీద పెట్టడం ఎలా?"

ఆ మహాత్ముడు ఆ ప్రశ్నకి వెంటనే జవాబు చెప్పలేదు.

భోజనాల దగ్గర చివర్లో ఆ ప్రశ్న అడిగినతను స్వీట్ల పళ్ళాల ముందు నించుని కాసేపు ఆలోచించి కాలా జామూన్ తీసుకున్నాడు. ఆ మహాత్ముడు వెంటనే అతన్ని అడిగాడు.

"దేనికింతసేపు ఆలోచించావు?"

"నాకు అన్ని స్వీట్లూ ఇష్టమే. కాబట్టి ఏది తినాలా అని ఆగాను."

"ప్రాపంచిక సుఖాలు, దైవం వైపు మళ్ళడం కూడా మనసుకి

తీపికరమైన విషయాలే. ఓ సారి భగవంతుడి మీద మీ మనసు పెట్టే విషయంలోని రుచి అందితే అప్పుడు మనసు దైవం వైపు తప్ప ప్రాపంచిక విషయాల మీదకి మళ్ళదు." వివరించాడా మహాత్ముడు.

## 39. విముక్తి

ఒకతను సన్యాస దీక్ష తీసుకున్నాడు. కొంత కాలం తర్వాత అతని కుటుంబ సభ్యులు అతనున్న మఠానికి వెళ్ళారు. అతను తన కుటుంబ సభ్యులందరినీ పలకరించి ఆప్యాయంగా మాట్లాడాడు.

"ఇంతకీ మా పెదనాన్న గారేరి?" అడిగాడా సన్యాసి.

"ఆయన నీ దగ్గరకి రావడానికి ఇష్టపడలేదు. ఎడ్లబండిలోనే కూర్చుని వున్నాడు." చెప్పారు అతని కుటుంబ సభ్యులు.

"అలాగా? సరే అయితే. విముక్తుడ్ని కాబట్టి నేనే వెళ్ళి చూస్తాను. ఆయనకి ఇంకా విముక్తి లభించలేదు కాబట్టి ఆయన అహంకారిగా ఉండటం సహజమే."

వెంటనే అతను ఊరి బయట ఆగి వున్న ఎడ్లబండి దగ్గరకి వెళ్ళి తన పెదనాన్నని చూసాడు.

## 40. మౌన భాష

నిత్యం ఏదో ఓ ఆధ్యాత్మిక ఉపదేశం చేసే తమ గురువు గారు ఆ రోజు మౌనంగా వుండటం చూసి శిష్యులు కారణం అడిగారు.

"ఇవాళ నేను చేసే ఉపదేశం భాషతో కూడిన శబ్దాల్లో కంటే మౌనంలోనే మీకు బాగా అర్ధమవుతుంది. కాబట్టి నా మౌన భాషని అర్ధంచేసుకునే ప్రయత్నం చేయండి." వివరించాడు గురువు.

కాసేపటికి గురువు శిష్యులలో పుండరీకుడనేవాడి వంక ప్రసన్నంగా చూసి వెళ్ళిపోయాడు. ఉత్సాహంగా కనిపించే అతని వంక చూసారు.